# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 01 అక్టోబర్ 2024




దర్గా ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

## రాయచోటిలో ప్రజాదర్బార్

కడప, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

సోమవారం సాయంత్రం రాయచోటి టిడిపి కార్యాలయంలో రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి పార్టీ కార్యాలయాకి అధిక సంఖ్యలో విచ్చేసిన ప్రజల నుండి ఓపికగా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆర్థికేతర అంశాలకు సంబంధించిన చిన్నచిన్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన వాటికి సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. తమ సమస్యలను సావధానంగా ఆలకించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రికి అర్జీదారులు తమ కృతజ్ఞతలను తెలిపారు.



# రాజకీయాలకు అతీతంగా రాయచోటి పట్టణ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

**పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పూర్తిగా సహకారాలు అందిస్తాం**

**అర్హులైన అందరికి పింఛన్లు, ఇండ్లు మంజూరుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**రాయచోటి రెవెన్యూ పెంచడానికి మున్సిపల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు**

**రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి**

రాయచోటి అర్బన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:

రాజకీయాలకు అతీతంగా రాయచోటి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ ఫయాజ్ బాషా అధ్యక్షతన జరిగిన రాయచోటి పుర పాలక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కార్యక్రమంలో మంత్రివర్యులు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడి 110రోజులు అయింది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం డీఎస్సీతో పాటు ఇతర స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని..దసరా నుంచి రాష్ట్రంలో పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఉచిత బస్సు సౌకర్యం కూడ మహిళలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వాలు, నాయకులు మారినా ప్రజలకు మంచి చేసే విధంగానే ఉండాలని అదే తమ నినాదం అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాయచోటి పురపాలక పాలక పక్షం సహకరించి ముందుకు వెళ్లాలన్నారు. అర్హులైన వృధ్ధులకు పెన్షన్లు, పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని పురపాలకలో గత పాలనలో వచ్చిన నిధులు ఎక్కడ వెచ్చించారో కూడ తెలియని పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. వెలుగల్లి నీటి పథకం ద్వారా పట్టణానికి తాగు నీరు అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. పట్టణంలో రెవెన్యూ స్థలాలను గుర్తించి కాంప్లెక్స్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాయచోటి మార్కెట్ యార్డును పునరుద్ధరించడం, అన్ని వర్గాలకు సంబంధించి స్మశాన వాటికల ఏర్పాటు కూడ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో కుక్కల సమస్య ఉన్నట్లు దృష్టికి వచ్చిందని దాని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాయచోటి పాత టౌన్ మరియు మిగిలిన చోట్ల పాత విద్యుత్ ఉన్నాయని వాటిని తొలగించి కొత్త పోల్స్ ఏర్పాటుచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రానున్న ఐదు సంవత్సరాలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని, అందరి సహకారంతో రాయచోటి పట్టణాన్ని రానున్న ఐదేళ్లలో అభివృద్ధి చేసి తీరుతానని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కౌన్సిల్ సమావేశంలో సభ్యులు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటిన్నింటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌కు మంత్రి సూచించారు. అనంతరం మొదటిసారిగా మంత్రి హోదాలో కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వాసు బాబు, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలి



కడప, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ఇష్టంతో విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జెసి అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ వారి కార్యాలయంలో అమలవుతున్న పథకాలలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విద్యను అభ్యసిస్తున్న విభిన్న ప్రతిభావంతులైన అంధులు, బదిరులు వారి విద్యను కొనసాగించడానికి వీలుగా ల్యాప్‌ట్యాప్‌లు, టచ్‌ఫోన్‌లను జెసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి అదితిసింగ్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగాలంటే ప్రతి ఒక్కరు చక్కని ప్రణాళిక రూపొందించుకుని, కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకోవాలని అన్నారు. అప్పుడే మన కష్టానికి తగ్గ ఫలితం అందుతుందన్నారు. మిగిలిన వారి కంటే విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరన్నారు. అనంతరం 4 ల్యాప్‌ట్యాప్‌లు, 10 డైసి ప్లెయర్, 12 టచ్‌ఫోన్‌లను జెసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సహాయ సంచాలకులు కష్ణకిషోర్, సమాచార శాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల పర్యవేక్షకులు అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిటోనేటర్లతో వీఆర్‌ఏ కుటుంబంపై దాడి

**- వీఆర్‌ఏ నరసింహులు మృతి**

**- భార్యకు తీవ్రగాయాలు - రిమ్స్‌కు తరలింపు**



పులివెందుల, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః

పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ)గా పనిచేస్తున్న ఎలంకూరి నరసింహులు కుటుంబంపై ఆదివారం రాత్రి 10.30గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్‌తో దాడి చేసిన సంఘటనలో వీఆర్‌ఏ ఎలంకూరి నరసింహులు (45) మృతిచెందగా అతని భార్య సుబ్బలక్ష్మమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి నరసింహులు తన నివాసంలో భార్య సుబ్బలక్ష్మమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి నిద్రిస్తుండగా నరసింహులు మంచం కింద గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్‌ను పెట్టి పేల్చడంతో నరసింహులుకు, అతని భార్య సుబ్బలక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. నందిపల్లె గ్రామం వద్దకు వెళ్లే సరికి నరసింహులు మృతిచెందగా తీవ్రగాయాలైన సుబ్బలక్ష్మమ్మను కడప రిమ్స్‌కు తరలించారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళినాయక్, సీఐ నాగరాజు, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సంఘటనా స్థలంలోని పలు వస్తువులను స్వాధీనం చేసుకుని అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వేముల మండల తహసీల్దారు ఇందిరారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రేఖ, సిబ్బందితో కలిసి సోమవారం ఉదయాన్నే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అయితే ఈ హత్యకు వీఆర్‌ఏ నరసింహులు భార్య సుబ్బలక్ష్మమ్మ అక్రమ సంబంధమే ప్రధాన కారణమంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గస్తీని ఏర్పాటు చేశారు.

### వైద్యఆరోగ్య రంగాన్ని మరింత

# పటిష్టం చేస్తున్నాం

**వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్**



కడప, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

వైద్య ఆరోగ్య రంగాన్ని, వైద్య విద్యను మరింత పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్ఆర్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ జిజిహెచ్ ప్రాంగణంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశలలో రూ.14 లక్షలతో అభివృద్ధి చేసిన మిని ఆడిటోరియం, ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్, సెంట్రల్ ల్యాబ్‌లో రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను, అలాగే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ బాకుఉలో రూ.6 కోట్లకు పైగా వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథ్ లాబ్ సెంటర్‌ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, జెసి అదితిసింగ్‌లతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం దంత వైద్యకళాశశల మిని ఆడిటోరింయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏ ఒక్క నిరుపేద ప్రాణానికి వైద్యం కొరత రాకూడదన్న సహృద్భావంతో రాష్ట్ర సిఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య రంగంలో విప్తవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య రంగాన్ని, వైద్య విద్యను మరింత పటిష్టం చేస్తున్నాయన్నారు. గ్రామస్థాయిలో కూడా నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా స్థాయి ఆసుపత్రులకు అన్ని ప్రభుత్వ వైద్య శాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతోందన్నారు. దశలవారిగా రాష్ట్రంలో ఇప్పటికే మంజూరైన వైద్య కళాశలలను పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జిల్లాస్థాయి ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసేలా మార్పును తీసుకురావాలని అన్ని విభాగాల వైద్యాధికారులకు మంత్రి సూచించారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, వైద్యసేవలను సక్రమంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారం సత్ఫలితాలను అందిస్తోందన్నారు. గతం కంటే ప్రస్తుతం, ప్రభుత్వ వైద్య శాలల్లో వైద్యసదుపాయాలు, వైద్యసేవలు మెరుగ్గా అందుతున్నాయని, గ్రామీణ వైద్యశాలల రూపురేఖలు మారిపోతున్నాయని, వైద్య రంగం పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 104 అంబులెన్స్ ద్వారా రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, సంతృప్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో అందరి ఆరోగ్య సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను మరింత పటిష్టం చేయడం జరుగుతోందన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి అక్కడి వైద్య శాలల్లో వైద్య సదుపాయాలను సమకూర్చడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతాయ వైద్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, సూపర్ స్పెషాలిటీ బ్లాక్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, కార్డియాలజి విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, వైద్యులు, మెడికల్ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## అక్రమ కట్టడాలపై అధికారుల చర్యలు శూన్యం

**ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని నిలదీసిన కౌన్సిలర్‌లు**




ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకో కుండా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని తక్షణమే అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అధికారులు స్పష్టం చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు నిలదీశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా అధకిఆరులు పొందు పరిచిన అజెండాలోని 19 అంశాలలో రెండు అంశాలను వాయిదా వేస్తూ 17అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సంధర్భంగా కౌన్సిలర్లు తమ వార్డులలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష అక్రమ కట్టడాలపై అధికారులను నిలదీశారు. గత రెండు సంవత్సరాలుగా 13వ వార్డు శ్రీరాముల పేటలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కౌన్సిల్ దృష్టికి మరియు మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై చాలా సార్లు చర్యలు తీసుకుంటామని అధికారులు సమాధానానికి ఆయన సంతృప్తిచెందలేదు.తక్షణమే అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టం చేయాలని చైర్‌పర్సన్ పొడియం ముందు భైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తక్షణ మే అక్రమ కట్టడాన్ని సందర్శించి మున్సిపల్ నిబంధణల మేరకు కట్టడాలను నిలిపివేయాలని మున్సిపల్ కమీషనర్‌ను చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ఆదేశించారు. అలాగే 14వ వార్డు కౌన్సిలర్ జీలాని బాష రోడ్డు మరమ్మత్తులపై అధికారులను ప్రశ్నించారు. గత మూడు నెలలుగా రోడ్లు, గుంతలు ఉన్నాయని మరమ్మత్తులు చేయాలని చెప్పినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తక్షణమే రోడ్లు మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు. అలాగే దసరా పండుగ సంధర్భంగా నెలకొల్పే ఎగ్జిబిషన్ ధరలు మున్సిపల్ గెజిట్ మేరకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్‌లు అధికారులకు సూచించారు. 15వ వార్డు కౌన్సిలర్ ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ టూ టౌన్ బైపాస్‌లో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని చాలా సార్లు అధికారులు దృష్టికి తెచ్చానని అన్నారు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటుచేయాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించింది. టూ టౌన్ బైపాస్ పార్కులో టాయిలెట్ ఏర్పాటుచేయాలని కౌన్సిలర్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఆర్వీఎస్ రమేష్ యాదవ్, మున్సిపల్ కమీషనర్ రఘునాధ రెడ్డి, డీఈ దస్తగిరి, పట్టణ ప్రణాళిక అధికారి చంద్రమోహన్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇళ్లకు అడ్డం - ప్లాట్లకు భద్రం

**ప్రజా ఉపయోగం లేని చోట పంచాయితీ నిధులు దుర్వినియోగం**

**వాటాల కోసం రియల్టర్ల మధ్య వివాధం**

రాజంపేట, సెప్టంబర్ 30, ప్రభాతవవార్త :



రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవరాలలో అక్రమార్కులంటే అధికారులు హడలెత్తిపోతున్నట్లు తెలుస్తుంది. వారు అడిగితే చాలు అడ్డంగా ప్రభుత్వ పంచాయితతీ నిధులను వారి అక్రమ పనుల కోసం దోచిపెడుతున్నట్లు కూడా తెలుస్తోంది. ఈ నిధులతో అక్రమారక్కులు ఎంతో కాలం నుంచి పట్టణాలలో నివశిస్తున్న ప్రజల ఇళ్లకు అడ్డంగా అక్రమ ప్రహరీలు నిర్మిస్తున్నారు. దీంతో ఆ ప్రహరీలు నివాసాల ఇళ్లకు అడ్డంగా ఉన్నా వీరు ఆక్రమించిన అక్రమ స్థలాల విక్రయ ప్లాట్లకు భద్రతను కల్పించే విధంగా ఉన్నాయి. అయితే ప్రజలకు ఉపయోగం లేని చోట పంచాయితీ అధికారులు లక్షలాది రూపాయల విధులను వెచ్చించి ఆ ప్లాట్ల ధరలకు రెక్కలొచ్చేలా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కొండలూ, గుట్టలు వాగులు, వంకలు, ఇరిగేషన్ స్థలాలు, చివరకు స్మశాన వాటికలు కూడా వదలకుండా ఆక్రమించేసి ప్లాట్లు వేస్తున్నారు. వీటికి కావాల్సిన వసతుల కోసం అన్ని శాఖల అధికారులు మూకుమ్మడిగా చేతులు కలిపి వారికి సహరించడం చూస్తుంటే పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ముక్కున వేలేసుకోక తప్పడం లేదు. కాస్తా చోటిస్తే తలమీదే పాదం పెట్టి పాతాల లోకానికి తొక్కే ఈ కబ్జా దారులకు ప్రభుత్వ శాఖల అధికారులు ఇచ్చే సహకారం అంతకంటే 10 రెట్లు ఎక్కువగానే కనబడుతుంది. కోడూరు పట్టణంలో ఇరిగేషన్ స్థలాలకు ఏటి పొరంబోకు స్థలాలలో వేసిన ప్లాట్లకు అధిక ధరలు పలికేందుకు పంచాయితీ శాఖ అధికారులు సుమూరు 10లక్షల రూపాయలు అండర్ డ్రైనేజి, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ ప్లాట్లలోకి ఇతరులెవరూ ప్రవేశించకుండా వారికి అడ్డంగా వీటికి భద్రంగా అక్రమ ప్రహరీని కూడా నిర్మించారు. ఈ వసతులతో ఆ ప్రభుత్వ స్థలాలలో వేసిన ప్లాట్లు సెంటు ధర 10 నుంచి 15లక్షల వరకు పలుకుతుంది. దీంతో రియల్టర్ల మధ్య వాటాల కోసం విభేదాలు కూడా చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.ఇది ఎక్కడో కాదు రైల్వే కోడూరు పట్టణ పంచాయితీలో ఉంగరాల నగర్ లో ఆక్రమించి ప్లాట్లు వేసిన ఆ రియల్టర్ల మధ్య వచ్చిన వివాదం పంచాయితీ అధికారికి ఇవ్వాల్సిన ముడుపుల వాటా కోసమే చోటు చేసుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఇదిలా ఉంటే రాజంపేట ప్రాంతంలోని పోలిఅప్పారాజు పేట పంచాయితీలో ఓ ఎన్ఆర్ఐ తన ఇంటికి పక్కనే ఉన్న సర్వే నెంబర్ 831బి లో 80 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్కడున్న ఇరిగేషన్ కాలువను కూడా పూడ్చి తన ఇంటికి రోడ్డు వేసుకున్నారు. ఈ ఎన్ఆర్ఐ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ శాఖాధికారులు బారీగా ముడుపులు అందుకొని యుద్ద ప్రాతిపదికన కబ్జా చేసిన స్థలంలో విద్యుత్ లైన్ లాగి ట్రాన్స్‌పార్మర్ అమర్చారు. ఈ విషయాలపై గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు వైఖోమ్ నైధియూ దేవి ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆమె స్పందించి ఎన్ఆర్ఐ ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ నిధుల విషయమై రైల్వేకోడూరు పంచాయితీ ఈఓ ప్రసాదరావును వివరణ కోరగా జరిగిపోయిన వాటి గురించి ప్రశ్నించడం ఎందుకు మేమే కొంత మంది ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి మోసపోయామని సమస్యను దాటవేశారు.

# క్రాసింగ్ పంటలతో మోసపోవద్దు-ఒప్పందంతోనే సాగు

**దువ్వూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



మండల పరిధిలో ప్రస్తుతం రైతులు క్రాసింగ్ పంటలైన జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ రెండు పంటలు సాగు చేసే సమయంలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, ఆర్గనైజర్లు, ఏజెంట్లు రైతుల వద్దకు వెళ్లి తమ కంపెనీకి చెందిన జొన్న, మొక్క జొన్న పంటలు సాగు చేస్తే దిగుబడి వచ్చిన తర్వాత అధిక ధర చెల్లిస్తామని, అలాగే పెట్టుబడి ఖర్చులు కూడ ఇస్తామని రైతులను మభ్య పెడుతున్నారు.అయితే ఈ రెండు పంటలు సాగు చేసే సమయంలో వివిధ రకాల కంపెనీలు రైతులతో ఎటువంటి ఒప్పంద పత్రాలు చేసుకోవడం లేదు. కేవలం ప్రతి నిధులు, ఏజెంట్లు చెప్పిన మాటలతోనే రైతులు జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నారు. గతంలో ఇటువంటి పంటలు సాగుచేసి ఎక్కువ మొత్తంలో రైతులు నష్టపోయారు. కంపెనీ ఇచ్చిన విత్తనాలు సరిగా మొలకెత్తగా పంట దిగుబడి రాక వివిధ పద్ధతుల్లో రైతు నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇలా నష్టపోయిన సంధర్భాల్లో రైతులు పోలీస్‌స్టేషన్‌కో లేక వ్యవసాయ శాఖ అధికారుల వద్దకో వెళ్లి తమ గోడులను వెళ్లిబోసుకున్న సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. అయినా ఈ పంటలు సాగు చేసేందుకు ఏజెంట్లు, ప్రతినిధులు రైతులను మభ్య పెడుతూ సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఒప్పంద పత్రం ఇవ్వమంటే కంపెనీ ప్రతినిధులు ఇవ్వడం లేదు. కేవలం నోటి మాటల ద్వారానే జొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంట దిగుబడి వచ్చిన తర్వాత జొన్న, మొక్కజొన్న తిరిగి పంట సాగు చేసేందుకు కంపెనీలు అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఇక్కడ కేవలం నామమాత్రపు ధరలను రైతులను చెల్లిస్తున్నారు. నష్టపోయిన సంధర్భాల్లో కంటితుడుపు చర్యలు మాత్రమే జరుగుతున్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా రైతులు క్రాసింగ్ పంటలు వేసి అధికంగా నష్టపోయారు. సంవత్స అప్పట్లో వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకున్న నామమాత్రంగా మాత్రమే కంపెనీలు నష్ట పరిహారం చెల్లించాయి. జొన్న మొక్కజొన్న క్రాసింగ్ పంటలు సాగు చేస్తే వ్యవసాయ శాఖ వాటికి ఈ పంట కూడ చేయదు. అవి పంటల భీమా పరిధిలోకి కూడ రావు. ఏమాత్రం నష్టపోయిన రైతులకు కంపెనీలు మాత్రమే డబ్బులు చెల్లించాలి. ఈ విధంగా కంపెనీలు చెల్లించడం లేదు. ప్రస్తుత సీజన్‌లో కంపెనీ ఏజెంట్లు తమ విత్తనాలను తీసుకోని పంట నమోదు చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల వివిధ రకాల కంపెనీలు దువ్వూరులో సమావేశమై భారీ ఎత్తున ఈ ఏడాది క్రాసింగ్ పంటల సాగు చేసేందుకు రైతులకు పిలిచి సమావేశాలు ఏర్పాటుచేశారు. ఇప్పటికైన రైతులు ఈ పంటల సాగు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోని మోసపోకుండా ఉండాలి. అందుకు వ్యవసాయ శాఖ అధికారులు కూడ రైతులకు అవగాహణ కల్పించాలి. పంటను సాగు చేసే సమయంలో రైతుకి, కంపెనీకి ఒక ఒప్పుదల పత్రం ఉంటే మేలు జరుగుతంది. ఈ విధంగా కంపెనీలు ఇవ్వడం లేదు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో క్రాసిగ్ పంటలు సాగు చేసుకుంటే ఇతి తమ పరిధిలోకి రాదని, వారికి పలు సూచనలు చేశారు. క్రాసింగ్ పంటలు సాగు చేసే సమయంలో ఖచ్చితంగా కంపెనీతో స్టాంప్ పేపర్‌పై ఒప్పందం చేసుకోవాలని ఆ ఒప్పదంతో పంట పండితే ఏ ధరకు కొనుగోలు చేస్తారో, నష్టపోతే ఎంత చెల్లిస్తారు అనే విశయాలు కూడ తెలుసుకోవాలన్నారు. అప్పుడు రైతులకు ప్రయోజనం ఉందుందని తెలిపారు. ఈ విశయంలో రైతులు తగు జాగ్రత్తలు క్రాసింగ్ పంటలైన జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సీతారామిరెడ్డి

**బద్వేలు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**



బద్వేలు ఎక్సైజ్ సీఐగా సోమవారం సీతారామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తూ బదిలీలలో భాగంగా బద్వేలుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మంజుల కర్నూలు జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో సీతారామిరెడ్డి బద్వేలుకు వచ్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను మద్యం షాపు యజమానులు పాటించాలన్నారు. పాత షాపులు రద్దుఅయ్యి కొత్తవి వస్తున్న నేపథ్యంలో నిబంధనల పట్ల జాగ్రత్తలు తీసుకుని మద్యాన్ని విక్రయించాలన్నారు. అలాగే బెల్టుషాపులు, నాటుసారా వంటివాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

## రాయచోటి నుంచి తిరుమలకు రెండు బస్సు సర్వీసులు

**పీలేరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్తః**


మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఆర్‌ఎం రాము

ప్రయాణికుల సౌకర్యార్థం అన్నమయ్య జిల్లా నుంచి రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి నుంచి తిరుమలకు రెండు నూతన సర్వీసులను త్వరలో నడుపనున్నట్లు డీపీటీఓ పి.రాము అన్నారు. సోమవారం పీలేరు ఆర్టీసీ డిపోను ఆర్‌ఎం పరిశీలించారు. డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం మాట్లాడుతూ మదనపల్లె డిపోలో పెట్రోలు బంకు నడుస్తుండటం వల్ల ఆర్టీసీకి ఆదాయం లభించిందన్నారు. త్వరలో రాజంపేట డిపోలో కూడా పెట్రోలు బంకును మంత్రి చేతులు మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాకు 40 బస్సులకు గాను ఇప్పటి వరకు 14 నూతన సర్వీసులు వచ్చాయని మిగిలినవి కూడా దశల వారిగా త్వరలో వస్తాయన్నారు. ఇప్పటి వరకు రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, రెండు పల్లె వెలుగు సర్వీసులు అద్దె బస్సులు వచ్చాయి. ఇంకనూ నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, 3 పల్లె వెలుగు బస్సులు అద్దెబస్సులు త్వరలో రానున్నాయన్నారు. కలకడలో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పీలేరులో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడపాలని సూచించారు. ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్కరు కషిచేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, బీఎస్ఎమ్ బాబునాయక్, ఏడీసీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 37 దివ్యాంగుల పింఛన్లు నిలిపివేత

**దువ్వూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 15గ్రామ సచివాలయాల పరిధిలో 37మంది దివ్యాంగులకు సంబంధించిన పింఛన్లను నిలిపి వేసినట్లు ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఇతర జిల్లాలలో సదరం సర్టిఫికెట్లు పొందిన దివ్యాంగులకు గత నెల 7వ తేది నుండి 20వ తేది వరకు కడప రిమ్స్‌లో తనిఖీ చేసుకోవాలని తెలిపారు. దీంతో ఈ 37మందికి నోటీసులు జారీ చేసి కడప రిమ్స్‌కు వెల్లవలసిందిగా తెలిపారు. అయితే వీరు వెల్లకపోడంతో 2037మందికి సంబంధించిన పింఛన్లను నిలిపివేశారన్నారు. జిల్లాలో 2242మంది పింఛన్‌దారులలో 2204మంది పింఛన్లు నిలివేశారన్నారు. మండలంలో మంగళవారం 15గ్రామ సచివాలయ పరిధిలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కలిసి వివిధ రకాల పింఛన్లను పంఇపణీ చేస్తారని ఇందుకుగాను 3కోట్ల 75లక్షల రూపాయలు విడుదల చేశామన్నారు. సిబ్బంది ఉదయాన్నే వెల్లి పింఛన్ దారులకు బయోమెట్రిక్ సేకరించి పింఛన్‌లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విధ్యార్థుల వితరణ

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విధ్యార్థులు, దాతల సహకారం వల్ల విధ్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో పూర్వ విధ్యార్థి ఎర్రం రెడ్డి ఈశ్వర ప్రసాద్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సుమారు రూ.2.50లక్షల తో విధ్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్‌కు కాంక్రీట్ ఫ్లోరింగ్ వేయించారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విధ్యార్థులకు 1991-92 సంవత్సర పూర్వపు విధ్యార్థులు రూ.10116 వేలు నగదును అందజేస్తున్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాలకు కావలసిన వసతులపై అడిగిన వెంటనే కాదనకుండా ఎర్రంరెడ్డి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి దాతృత్వంలో అందజేస్తున్నారని అన్నారు. ఈ సంధర్భంగా పూర్వ విధ్యార్థి ఎర్రం రెడ్డి ఈశ్వర ప్రసాద్‌రెడ్డిని పాఠశాల తరపున ఉపాధ్యాయుల బృందం శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుపాకుల చంద్ర ఓబుళరెడ్డిలతో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**పీలేరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్తః**

మండలంలోని గర్నిమిట్ట గ్రామ పంచాయతీ మల్లారపు వాండ్లపల్లె దళితులు, కొంతమంది అగ్రవర్ణాలు ఇల్లు నిర్మించుకోవడానికి గుణాతాలు, గోడలు కట్టుకోవడం జరిగిందని ప్రస్తుత రెవెన్యూ అధికారులు ఇక్కడ ఇల్లు నిర్మించడం చట్ట విరుద్దమని కొంతమంది దళితుల ఇళ్లను మాత్రమే జేసీబీలతో కూలదోయడం చాలా బాధాకరమని నష్టపోయిన దళితలకు న్యాయం చేయాలన్నారు. వీరు మోసపోవడానికి కారకులైన రెవెన్యూ అధికారులు, బోరువేసిన వారితోపాటు అప్పుడుపనిచేస్తున్న అధికారులుపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ చమకూరి శ్రీధర్‌గారిని కోరడమైంది. ఈవిషయంపై స్పందించిన కలెక్టర్ కేవిపల్లె తహశీల్దారుతో మాట్లాడి చట్టబద్దంగా న్యాయం చేస్తామని విచారణ జరిపి నిజనిజాలు వెలికి తీసి కారణమూన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో వెంకటేష్, రంగారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

## గురుకులంలో స్వచ్ఛత కార్యక్రమాలు

**వైవీయూ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**




యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ - 1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బండ మీద గంగయ్య ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని గురుకులం విభాగం పరిసరాలలో పిచ్చి మొక్కలను వలంటీర్లు తొలగించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీవో బి. గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ ఆచార్యులు పి. సరిత, వలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారిస్తాం

**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి మరియు సిబ్బంది కొరతపై దృష్టి సారించి పరిష్కరిస్తామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి ఆయన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణీ స్త్రీల విశయంలో జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ సంధర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై చేసిన సమీక్షా సమావేశంలో ఆసుపత్రికి కావలసిన మౌళిక వసతుల విశయంలో కొరత లేకపోయినా వైద్యులు మరియు నర్సుల కొరత ఉన్నట్లు అర్ధమయిందన్నారు. 350పడకల ఆసుపత్రిగా ఉన్న ప్రొద్దుటూరులో నర్సింగ్ పోస్టులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే మరోసారి సమీక్షలు నిర్వహించి సంబంధిత వైద్యులను మరియు మనశులను నియమిస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల ప్రొద్దుటూరు మెడికల్ కాలేజీ కేటాయించేందుకు అన్ని వసతులు ఉన్న తన సొంత నియోజకవర్గమైన పులివెందులకు తరలించారన్నారు. కానీ పులివెందులలో కూడ మెడికల్ కాలేజీకి మౌళిక వసతులు కల్పించడంలో కానీ ఫ్యాకల్టీ నియమించడంలో కానీ జగన్ విఫలయ్యారని విమర్శించారు. అందుకే పులివెందుల మెడికల్ కాలేజీకి కేంద్రం అనుమతులు లభించలేదన్నారు. ప్రొద్దుటూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్న ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రొద్దుటూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలు పరిశీలించి కనీసం ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేసేలా కృషిచేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి కావలసిన సర్జన్స్ వైద్యులు మరియు నర్సులు తక్షణమే నియమించాలని కోరారు. అలాగే మెడికల్ కాలేజీ ఏర్పాటుచేసేందుకు చొరవ చూపాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్నెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండా రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి మరియు బీజేపి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలలో వివిధ కార్యక్రమాలు

**చాపాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

మౌళిక వసతుల సదుపాయాల కల్పన, పౌష్టికాహారం ఆట పాటలతో కూడిన విద్య అంగన్వాడీల ద్వారా అందిస్తున్నట్లు జిల్లా సమన్వయ కర్త స్వరూప తెలిపారు. సోమవారం మండలంలోని ఖాదర్ పల్లి, చాపాడు, చియ్యపాడు గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా అంగన్వాడి కేంద్రాల్లోని కిశోర బాలికలకు రంగోలి, ఈ ప్రైమరీ స్కూల్ పిల్లలతో డ్రాయింగ్, ఫ్యాషన్ డిజైన్, క్రాఫ్ట్ సెక్షన్, ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చియ్యపాడు పంచాయతీ కార్యదర్శి ఎం.సుధాకర్, సూపర్‌వైజర్ శుభ రత్నమ్మ, అంగన్వాడి కార్యకర్తలు సుజాత, తెహరా, రోజమ్మ, శ్రీదేవి, సరస్వతి, ఆశా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## చందనా ఖాన్ మృతి కళారంగానికి తీరని లోటు

**వైవీయూ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



కడప జిల్లా కలెక్టర్‌గా సేవలు అందించిన చందనా ఖాన్ మృతికి యోగి వేమన యూనివర్సిటి, లలిత కళా విభాగం నివాళులు అర్పించింది. లలిత కళల విభాగ అధిపతి డాక్టర్ కోట మృత్యుంజరావు మాట్లాడుతూ ఆమె మరణం కళా రంగానికి తీరని లోటన్నారు. చందనాఖాన్ టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగాన్ని ఎంతో ప్రోత్సహించారని, రెండు సార్లు హరిత హోటల్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆమె సూచనలతో నిర్వహించడం జరిగిందని, అంతేకాక శిల్పారామం అభివృద్ధి కమిటిలో లలిత కళా విభాగం అవసరం గుర్తించి లలిత కళా విభాగం ఆద్వర్యంలో పలు వర్కు షాపులు నిర్వహించాలన్నారు. ఆమె స్వతహాగా చిత్రకారిణి కావడం వల్ల కళలకు ప్రోత్సహాన్ని ఇచ్చారన్నారు. ఇటీవలే ఆమె తన పెయింటింగ్‌లలో కొన్నింటిని యూనివర్శిటికి ఇవ్వాలని అనుకున్నారని, ఇంతలోనే ఇలా జరిగిందన్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హస్తకళల విశ్వవిద్యాలయం రూపకల్పనలో నన్ను కోర్ కమిటిలో సభ్యుడుగా, శిల్పారామం అభివృద్ధి కమిటి సభ్యుడుగా నియమించారని అన్నారు. ముఖ్యంగా విభాగం పేరు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఆమె కారణం అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, చినరాయుడు, ఇరప్ప, చంటి సూరి,, వాసవి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం రైతులు శివునికి అభిషేకం

**ముద్దనూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

ముద్దనూరు మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వర్షాలు సకాలంలో పడాలని సోమవారం నాడు గ్రామస్థులు, రైతులు శివాలయంలో శివుడికి 101 బిందెలతో నీళ్లు పోయడం జరిగింది. అనంతరం స్వామి వారికి అభిషేకం చేసి సకాలంలో వర్షాలు పడాలని రైతులు సంతోషంగా ఉం డాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికి పాణికం, బ్యాల్లు, కేసరి అందజేయడం జరిగిందని గ్రామస్థులు తెలియజేశారు.



## నూతన డీటీకి కూటమి నేతల సన్మానం

**చిట్వేలి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



మండల డిప్యూటి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మోహన కృష్ణను మండల కూటమి సీనియర్ నాయకులు కాకర్ల లారి సుబ్బరాయుడు, రామాంజనేయులు నాయుడు, భాజాపా ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకేపాటి వెంకట రెడ్డి, యువ నాయకులు కాకర్ల నాగార్జునలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భూ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిక్కచ్చిగా వ్యవహరించి మండల ప్రజలకు సత్వర న్యాయం చేయాలని డిటి మోహణ కృష్ణకు సూచించారు. తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలిపారు.

## చేతన ఫౌండేషన్ సేవలు మరువలేనివి

**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరులో చేతన ఫౌండేషన్ సేవలు మరువలేనివని ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మహిళా సాధికారతలో భాగంగా సోమవారం ఉదయం రాయల్‌కౌంటీ రీసార్ట్ ప్రాంగణంలో చేతన సంస్థ సౌజన్యంతో వికసిత ఫౌండేషన్ నేతృత్వంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన 20మంది మహిళలకు మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సంధబ్బంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ చేతన సంస్థ చైర్మెన్ వెనిగళ్ల రవికుమార్ చేస్తున్న సేవలు మరువలేనివి అని అన్నారు. ఈ సంధర్బంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ చేతన సంస్థ చైర్మెన్ వెనిగళ్ల రవికుమార్ చేస్తున్న సేవలు మరువలేనివని అని అన్నారు. ఈ సంధర్భంగా శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ సంస్థ అందిస్తున్న సేవలతో సమాజంలోని అట్టడుగు వార్గాల వారు కొందరైన ఉన్నత స్థితికి వస్తే తమకు అదే సంతోషం అన్నారు. పూర్తిస్థాయిలో తాము అండదండలు అందించలేకపోయినా ఎవరి పాటికి వారు తమ కాళ్ల మీద నిలిచేలా సహకరిస్తామని ఇదే తమ చైర్మెన్ రవికుమార్ ఆశయమని స్పష్టం చేశారు. ఉపాధికి ఉపకరించే కార్యక్రమాలతో పాటు కృత్రిమ అవయవాలు అందజేత, ప్రకృతి వైపరీత్యాలలో ప్రజలకు అండగా వంటి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రాంతాల వారాకి కూడ తమ సేవలు ప్రచారానికి దూరంగా అందించడం విశేశం అని కొనిఆడారు. చేతన సేవలు వివరిస్తూ, సమాజ సంక్షేమం కోసం చేతన చేస్తున్న కృషి మరువలేనిదని అన్నారు. మహిళా సంక్షేమంలో చేతన సంస్థ చైర్మెన్ వెనిగళ్ల రవికుమార్ మరింత విస్తృత సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, శివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొంత గడ్డపై ప్రజలు చూపిన అభిమానం పట్ల మంత్రి హర్షం

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

ఆదివారం, సోమవారం జరిగిన ప్రొద్దుటూరు పర్యటన గురించి మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల, సంఘాల ప్రతినిధులు, ప్రజలు స్వాగతం పలకడం పట్ల హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సొంత గడ్డపై తన ప్రజలు చూపిన అభిమానం ఎంతో సంతృప్తి కలిగించిందన్నారు. పుట్టపర్తి సర్కిల్ నుంచి ప్రారంభమైన పౌర యాత్ర సాంప్రదాయ రీతిలో ఆశ్వరథంపై సాగింది. దారి పొడవున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రథం ముందు స్కౌట్స్, చెక్కభజన, తాళభజన, కోలాటం, పౌరాణిక, జానపద వేశాలు, కట్టెసాము మొదలైన వారు స్వాగతం పలుకగా అఖండమైన జనసందోహం మధ్య జమ్మలమడుగు రోడ్డులోని రాయల్ కౌంటీ రిసార్ట్స్‌కు చేరింది. అక్కడ పౌర సన్మాన సభలో వివిధ వర్గాల సంఘాల నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. దాదాపు 3000ప్రజలు ఈ సన్మాన సభలో నపాల్గొని మంత్రిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సన్మాన సభకు ముఖ్య నిర్వాహకులుగా సంస్కృతి స్వచ్ఛద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, పంచగల మధుసూధన బాబు వ్యవహరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సన్మాన కమిటి సభ్యులు అడ్వకేట్ సీవి సురేష్, భాస్కరరావు, జనార్ధన రెడ్డి, అంకాల్, కొండయ్య, భోగా గంగాధర్, కేరోజీరావ్ తదితరులు పాల్గొన్నారు.



# మానవతా సేవా భావంతో వైద్య సేవలు అందించండి

**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు పట్టణ పరిసర ప్రాంతాలు రైతులు వ్యవసాయ కూలీలు పేద ప్రజలు ఎక్కువగా ఉన్నారని మాదనవతా విలువలతో సేవా భావంతో వైద్య సేవలు అందించాలని ఎస్ఎస్ హోలిస్టిక్స్ యాజమాన్యాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ కోరారు. సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలో గాంధీ రోడ్డులో ఎస్ఎస్ హోలిస్టిక్ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్న ప్రొద్దుటూరులో వైద్య సేవలు అందుబాటు ధలలో ఉండాలని యాజమాన్యానికి సూచించారు. బిపి, షుగర్, కార్డియాక్ సేవలకు శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ పేరెన్నిక కలిగించిందని క్యాథల్యాబ్ కలిగి ఉండటం విశేషం అన్నారు. పేదలు, రైతులు అధికంగా ఉన్న ప్రొద్దుటూరు ప్రజలకు తక్కువ ధరలకే వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ ప్రొద్దుటూరులో ఏర్పాటుచేయడం శుభపరిణామం అన్నారు. పెరు గుతున్న ప్రొద్దుటూరు జనాభా కోసం ఈ ఆసుపత్రి ప్రయోజకరమన్నారు. ఈ ఆసుపత్రిలో కార్డియాలజి న్యూరాలజీలలో నిష్ణాతులైన వైద్యులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మధుసూధన్ రెడ్డి, ఆసుపత్రి యాజమాన్యం ప్రముఖ వైద్యులు రామచంద్రారెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్‌కుమార్ రెడ్డి, ఆసుపత్రి సీఈఓ శరత్ బాబు మరియు వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

● I . CHITWALI LAKSHMI DEVI, W/O CHITWALI SREENU (OLD NAME), PASSPORT NO: M9883102 ,JOROPALLI VILLAGE, NAKKALAPALLI POST, CHITVEL MANDAL,ANNAMMAYYA DIST, A.P HAS CHANGED MY NAME AS CHITVEL LAKSHMI DEVI,W/O CHITVEL SREENU (NEW NAME).

PUBLIC NOTICE

**BEFORE SHRI. NAKUL DEWAN, SR. ADVOCATE. (International Commercial Arbitration as per Hon'ble Supreme Court order dated. 08.07.2024 passed in Arbitration. Petition No. 50 of 2022)**

***Between the Parties:***
**Union Pipes Industry LLC**
Office at ICAD I Mussafah
PO Box 9650, Abu Dhabi - UAE
Through his Power of Attorney
**Mr. Kambhampati Venkata Ravi Mohan,** S/o Kameswara Rao
R/o Flat No.301, Indu Towers, Dayananad Nagar, Malkajgiri, Hyderabad-500047, Telangana.
Email: ravimohan@jurisprime.com
**...Claimant/Petitioner**

**1. M/s UPI Polymers Pvt. Ltd.**
Through its Authorized Signatory Regd. Office at Sy. No.2508, Industrial Park, Survepalli Village, Venkatachalam Mandal, SPSR Nellore District, Andhra Pradesh State-524 320.
Email: info@upipolymers.net
CIN: U25200AP2010PTC066639
**2. M/s Akshaya Irrigation Products Private Limited,** Regd. Off: Plot No. 130/131, Phase-II, IDA, Cherlapally, Hyderabad-500051
Email: akshayadrip@gmail.com
CIN: U28990TG1993PTC016592.
**Also at:**
#Door No.3-5-124/3/2, 2nd Floor, Plot No.19, Krishna Nagar Colony, Hyderguda, Attapur, Hyderabad, Telangana State- 500 048
Rep. by its Authorised Signatory
**Mr. J.K. Viswanath Singh**
S/o J.K. Narasimhulu Singh, R/o D.No.11/687, Habibulla Street, Kadapa, Andhra Pradesh State-516001.
**3. MAP Industrial Projects LLP**
Regd Office at A-2, Girisikhara Apartments, 6-3-600/3, Erramanzil, Khairatabad, Hyderabad-500004, Telangana.
Represented by its authorized signatory **Mr. JK Rajesh Singh,** S/o JK Narsimhulu Singh, R/o Flat No 310, Vijaya Hills Apartments, D-Wing A.C Guards, Lakdikapul, Hyderabad-500004, Telangana.
Email: info@upipolymers.net
LLPIN-AAA-6014
**...Respondents**

Whereas Respondent Nos. 2 and 3 have deliberately evaded the service of notices, you are hereby notified that if you fail to appear and defend the case scheduled for hearing on October 4, 2024, at 5:00 PM, either physically at the International Arbitration and Mediation Centre (IAMC), Hyderabad, located at 21st & 22nd Floor, Vijay Krishna Towers, Financial District, Gachibowli, Nanakramguda, Hyderabad, Telangana 500032, or virtually via the Zoom link: https://us06web.zoom.us/j/2756062406?pwd=wb96joKompJkY501OQIUEQ9jZVZr1E.1&omn=82664045485, the matter will be heard and proceeded with ex-parte in your absence.

**Sd/- PRAVEEN JAIN**
**Advocate**
**Juris Prime Law Services**
#Plot No.33, First Floor, Rao and Raju Colony, Near Lucid Diagnostics, Road No.2, Banjara Hills-500034, Hyderabad, Telangana, India.

## కడప-బెంగళూరు రైల్వేలైను పనులను ప్రారంభించాలి

### సిపిఐ నాయకులు మురళి డిమాండ్

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సిపిఐ నాయకులు

కడప-బెంగళూరు వయా మదనపల్లె మీదుగా రైల్వేలైను పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత యూపిఏ ప్రభుత్వంలో కడప నుంచి రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వే లైను నిర్మాణానికి అనుమతులు జారీ చేసినా, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవటంతో రైల్వేలైను పనులు ముందుకు సాగలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఈ రైల్వే లైను అలైన్మెంట్ మార్పుచేయటం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం అలైన్మెంట్‌ను రద్దు చేసి వెంటనే రైల్వే నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే మదనపల్లె ప్రజల దాహార్తిని తీర్చే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మదనపల్లె - చెంబకూరు వరకూ రోడ్డు వెడల్పు చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుమల, సూరి, రెడ్డి, శోభ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్‌గ్రేడింగ్ పోటీలలో యూత్ కరాటే విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :


కరాటే విద్యార్థులతో సిఐ చాంద్‌బాషా

బెల్ట్‌గ్రేడింగ్ పోటీల్లో మదనపల్లె యూత్ కరాటే విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్ ఎఆర్.సురేష్ తెలిపారు. సోమవారం ప్రతిచాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒకటవ పట్టణ సిఐ చాంద్‌బాషా మాట్లాడుతూ కరాటే ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఎంతో మంది విద్యార్థులను కరాటేలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న మాస్టర్‌ను అభినందించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను బెల్ట్‌లు, సరిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శివ, కరాటే బ్లాక్ బెట్స్ మహేశ్వర్, మొహమ్మద్‌ఐమాన్ ఉమర్, లాస్య, తేజిత్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



పెండ్లిమర్రి మండలంలోని యోగివేమన యూనివర్సిటీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు లక్ష్మయ్య మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. లక్ష్మయ్య కడపలో ఉంటూ పెండ్లిమర్రి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయాన్నే కడప నుండి స్కూలుకు వస్తుండగా యోగివేమన యూనివర్సిటీ దగ్గరకు వచ్చే సరికి పంది అడ్డుగా రావడంతో ఒక్కసారిగా కిందపడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కపడ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సుజాత, హైస్కూల్ ఉపాధ్యాయులు వెంటనే ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## చీనీతోటలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు

పులివెందుల, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



పులివెందుల మండలంలోని రచ్చుమర్రిపల్లె గ్రామంలో ఉన్న చీనీతోటలను సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ చీనీతోటను పరిశీలించి చెట్లకు సోకిన వేరుకుళ్లు తెగులు, మంగు, పొలుసులను గుర్తించి నివారణ మార్గాలను రైతులకు సూచించారు. వేరుకుళ్లు నివారణకు ట్రైకోడెర్మా జీవశిలీంద్రాన్ని పశువుల పేడతో కలిపి బెల్లపునీటితో మిశ్రమాన్ని తడుపుతూ పది రోజులు నిల్వ ఉంచి చెట్ల మొదళ్ల నుండి కొంచెం దూరంలో వేసుకోవాలని తెలిపారు. ఇతర రసాయనాల పిచికారి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, వీహెచ్‌ఏ, చీనీరైతులు పాల్గొన్నారు.

## వార్డులలో మున్సిపల్ చైర్మన్, కమీషనరు పర్యటన

పులివెందుల, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో వార్డు పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, కమీషనరు రాముడు, వైస్‌ఛైర్మన్ హాఫీజ్‌లు వివిధ వార్డులలో పర్యటించారు. చందమామ డాబా వద్ద ఉన్న భూగర్భ డ్రైనేజి సమస్యతో పాటు షాదీఖానా వద్ద రోడ్డు రాకపోకలకు ఇబ్బంది, న్యాక్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న రజక కాలనీలో దోబీఘాట్ మురికినీరు, ఇతర సమస్యల గురించి మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కమీషనరుల దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలరు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

వేంపల్లె, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః




విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రిన్సిపల్ రామసుబ్బయ్య అన్నారు. వేముల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయానుసారం కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, వారు సాధించిన మార్కుల గురించి వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాయంత్రం 4.00నుండి 5.00గంటల వరకు స్టడీఅవర్స్ నిర్వహించాల్సి ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. అయితే ఆయా గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేనందున, తల్లిదండ్రుల సూచనల మేరకు స్టడీఅవర్స్‌ను సాయంత్రం 4.30గంటలకు ముగించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతి నెలా జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రవి శంకర్, బాలయ్య, శ్రీను, సుబ్బరాయుడు, అంజాద్‌అలీ, కిరణ్మయి, వీరపుల్లయ్య, బాబి, బోధనేతర సిబ్బంది నాగమ్మ, స్వర్ణలత, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తొండూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



తొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపయోగకరమైన అభ్యసన సామాగ్రిని వేంపల్లెకు చెందిన ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బివిస్ రమణారెడ్డి అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ నమూనా ప్రశ్నపత్రాలను అవగాహన చేసుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. రూ.20వేలు విలువైన పుస్తకాలు అందించిన దాత రమణారెడ్డిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## పోషకాహార లోపానికి గురికాకూడదు

వేంపల్లె, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



మహిళలు, పిల్లలు, కిశోరబాలికలు పోషకాహార లోపానికి గురికాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం శక్షం అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సునీత అన్నారు. సోమవారం శక్షం అంగన్వాడీ కేంద్రాలుగా ఎంపికైన క్రిష్టియన్ కాలనీ, ప్రియాతోట, బిడాలమిట్ట ప్రాంతాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. శక్షం కేంద్రాల్లో పోషణవాటిక, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఆర్వో సిస్టమ్, ఎల్ఈడీ టీవీ, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ పోషణమాసం ముగింపు సందర్భంగా దేశవ్యాప్తంగా 11వేల అంగన్వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఎంపికైన కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి వీటిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, నాగరత్న, హెల్త్ సూపర్‌వైజరు వెంకటలక్ష్మమ్మ, సీహెచ్‌వో వెంకటరత్నం, ఏఎన్ఎం లక్ష్మిదేవి, మహిళీ పోలీసు అర్చన, అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి, సుజాత, సరస్వతి, ఎంపీటీసీ మణిగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగన్న, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

## దేవస్థాన కమిటి ఏర్పాటుకు అనుమతివ్వండి

వేంపల్లె, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



వేంపల్లెలోని శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానం కమిటి ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి టీడీపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఉన్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని వేంపల్లెకు చెందిన టీడీపీ నేతలు పి.వి.రమణ, నల్లగారి కృష్ణారెడ్డి, దేవస్థాన మాజీ ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడులు కలిశారు. దేవస్థాన పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ వచ్చి చాలా రోజులైందని, దానికి సంబంధించి దరఖాస్తులు కూడా పంపినట్లు చెప్పారు. త్వరగా కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాలకమండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు త్వరితగతిన కమిటి ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్పందించిన మంత్రి దేవస్థాన కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమీషనరు సత్యనారాయణను కూడా వారు కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ఇతర రాష్ట్రాలకు చెందిన వారి వేలిముద్రలు నమోదు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



ఇతర రాష్ట్రాలకు చెంది పులివెందులలో ఉంటూ పనులు చేసుకుంటున్న వారి వేలిముద్రలను పోలీసులు సేకరించారు. ఇటీవల పట్టణంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం పశ్చిమబెంగాల్‌కు చెందిన 22మందిని స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## పర్యాటక పురస్కార గ్రహీతకు ఘన సన్మానం

వేంపల్లె, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ః



ఎక్స్‌లెన్స్ ఇన్ రైటింగ్ బహుమతి ప్రదాత బాలగొండ గంగాధర్‌ను వేంపల్లెలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, బోధనా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చెరసాల యోగాంజనేయులు మాట్లాడుతూ రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పొందుతున్న పర్యాటక రంగంపై విశిష్ట రచనలు చేసి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు పొందిన గంగాధర్ మా కళాశాలలో ఉండడం అదృష్టమని తెలిపారు. కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పర్యాటక కోర్సు ప్రారంభించి, వందలాది మంది విద్యార్థులను నిపుణులుగా తయారు చేశారని, అనేక వ్యాసరచనలతో ప్రతిష్టాత్మకమైన అవార్డు పొందాలని కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, నాగలక్ష్మి, మల్లేశ్వరమ్మ, మాధవరావు, సుధాకర్, రామకృష్ణ, అరవింద్, షఫివుద్దీన్, రాజారెడ్డి, జనార్ధన్, పీడీ తేజేంద్ర, సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.

## జనసేన నాయకులు వారాహి సభను విజయవంతం చేయండి

బద్వేలు , సెప్టెంబరు 30 ప్రభాతవార్త :



ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ చేపట్టబోయే వారాహి సభను నియోజకవర్గంలోని ప్రతి జనసైనికుడు, వీరమహిళలు పాల్గొని విజయవంతం చేయాలనిఆ పార్టీ బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త బసివి రమేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అక్టోబర్ 1వ తేదిన అలిపి ఘాటునుంచి పాదయాత్ర ద్వారా తిరుమలకు చేరుకుని 2వ రోజు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని, 3వ తేది సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో వారాహి సభలో పాల్గొని రాష్ట్రప్రజలకు సందేశం ఇస్తారన్నారు. ఈ సభ కేవలం పార్టీకి మాత్రమే సంబంధించినది కాదని ప్రతి హిందువుకు సంబంధించినదన్నారు. కావున బద్వేలు నుంచి ఉదయం 7 గంటలకు బయలు దేరేందుకు వాహనాలు ఏర్పాటు చేశారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, అనిల్‌కుమార్, చంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాంసపు దుకాణాల వారికి హెచ్చరిక

బద్వేలు అర్బన్ , సెప్టెంబరు 30 ప్రభాతవార్త :



అక్టోబర్ 2వ తేది గాంధీజయంతి సందర్భంగా ఆరోజు ఎలాంటి జీవహింస చేయరాదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాంసపు దుకాణదారులకు సూచించారు. అలాగే మిగతా రోజులలో మాంసపు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని, కేటాయించబడిన చెత్త వాహనాలలోమాత్రమే వేయాలన్నారు. అలాగే ఆయా షాపుల యందు తప్పక పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యకరమైన జీవాల మాంసాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. పై సూచనలన్నింటి మాంసపు దుకాణదారులు తప్పక పాటించాలని అలా కాదని వ్యవహరిస్తే అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## వార్డు సెక్రటరీలతో సమావేశం నిర్వహించిన కమిషనర్

బద్వేలు అర్బన్ , సెప్టెంబరు 30 ప్రభాతవార్త :

పట్టణంలో సచివాలయ వార్డు అనిమెటీస్ సెక్రటరీలతో సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సమావేశం నిర్వహించారు. ఇందుఓ బాగంగా అనుమతిలేని కుళాయి కనెక్షన్‌ల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై సమీక్షించాలని, ఇంటి న్నులు లేని ఇళ్లను, ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు వేయాలని సూచించారు. అలాగే ఆయా షాపుల లైసెన్సులు, అడ్వైర్‌టైజ్‌మెంట్ పన్నుల వసూల్లలో పరిపాలన కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సుమన్, మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ సుధీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలిక మృతి

గాలివీడు, సెప్టెంబర్ 30(ప్రభాతవార్త):



రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో హర్షిత(12) మృతిచెందిన విషాద ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్లితే పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం ఆంజనేయపురానికి చెందిన రమేష్ కుమార్తె హర్షిత ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని నాలుగు చక్రాల వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ చిన్నారి మృత్యు ఒడిలోకి చేరుకున్నది. ఈ విషాద ఘటనతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

## పకడ్బంధీగా ఫ్రీహోల్డ్ భూములను పరిశీలించండి

గాలివీడు, సెప్టెంబర్ 30(ప్రభాతవార్త):



ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బంధీగా ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించాలని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన వివరాలను వీఆర్‌ఓల చేత పరిశీలింప చేయించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వివిధ గ్రామ పంచాయతీలలో 20 సంవత్సరాల క్రితం పంపిణీ చేసిన డీకేటీ భూములు రిజిస్ట్రేషన్ కావడం జరిగిందని ఇలాంటి ఫ్రీ హోల్డ్ భూములలో అనేక అవకతవకలు జరిగినట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించినదని వీటిపైన ప్రస్తుత ప్రభుత్వం పున: పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. ఉన్నతాదికారుల ఆదేశం మేరకు గత కొన్ని రోజులుగా రెవెన్యూ అధికారులు వివిధ గ్రామాల పంచాయతీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఫ్రీ హోల్డ్ భూములను వాటి వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం ప్రజల దగ్గర నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ఎస్జిటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :



ఎస్జిటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లాశాఖ నరసింహులు సోమవారం ప్రొద్దుటూరులో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించి పలు ఉపాధ్యాయ సమస్యలైన ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో ఓటు హక్కు కల్పించాలని, అదే విధంగా గత ఐదేళ్లలో సిపిఎస్ ఉద్యోగులకు బకాయి పడిన బకాయిలన్నీ చెల్లించేలా కృషి చేయాలని, ఈ హెచ్ఎస్‌లో భాగంగా అన్ని రెఫరల్ ఆసుపత్రిలో ఓపి సౌకర్యం కూడా కల్పించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేలా కృషి చేయాలని వినతి పత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం. నరసింహులు, జిల్లా గౌరవాధ్యక్షులు కె. పరుశురాం, రాష్ట్ర కార్యదర్శి టి. మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :



లక్కిరెడ్డిపల్లె మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం టిడిపి నాయకులు చెల్లు శ్రీనివాసులు యాదవ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిని దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. తాగునీరు, కరెంట్, ఉచిత వైద్యం, రవాణా, డ్రైనేజీ సమస్యలు లేకుండా అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య కొరకు బోర్లు వేసి తాగునీరు సరఫరా చేశామన్నారు. అసంపూర్తిగా ఉన్న రామచోటి, చాగలమర్రి హైవేను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దానిపై మంత్రి సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్లతో మాట్లాడి ఇప్పటికే పనులు ప్రారంభించారని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మండల యువ నాయకుడు యనమల మదనమోహన్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, చెల్లు శ్రీనివాసులు యాదవ్, టిడిపి ప్రచార కార్యదర్శి యనమల విశ్వనాథ్, జెకె అమీర్, సునీల్, రమణ, నజీర్, టిడిపి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐగా తులసి

రైల్వేకోడూరు, సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐగా తులసి సోమవారం బాధ్యతలను చేపట్టినట్లు క్రింది సిబ్బంది తెలిపారు. ఈమె కడప నుండి రైల్వేకోడూరు ఎక్సైజ్ స్టేషన్కు బదిలీ పై వచ్చినట్లు సిబ్బంది పేర్కొన్నారు.ముఖ్యంగా నాటు సారా పై ప్రత్యేక దృష్టి ఉంచి అక్రమార్కులను మెడలు వంచుతామని తెలియజేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం కడపకు పై అధికారులను కలిసేందుకు వెళ్లినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

## రైల్వేకోడూరు తాసిల్దారుగా మెహబూబ్ చాంద్

రైల్వేకోడూరు,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:



రైల్వేకోడూరు తాసిల్దారుగా ఎట్టకేలకు రాజంపేట నుండి రైల్వే కోడూరుకు వచ్చిన తాసిల్దార్ మెహబూబ్ చాంద్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న భూ సమస్యలను వేగవంతంగా పూర్తి చేస్తామని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని వేగవంతంగా పరిష్కరిస్తామని ఆమె తెలియజేశారు. అనంతరం సిబ్బందితో దిటీ రెడ్డి ప్రసాద్,ఆర్ ఐ రాజశేఖర్, వీఆర్వోలు ఎమ్మార్వోతో చర్చించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

### -ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:

సమాజంలో విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్క సాయి వికాస్ రెడ్డి లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైల్వేకోడూరు పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్,టిడిపి యువ నాయకులు ముక్క సాయి వికాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్య గొప్ప ఆయుధమని వారు అన్నారు.భవిష్యత్తులో ఉన్నత విద్యతో ఉన్నత స్థాయికి చేరవచ్చని సమాజంలోని ప్రతి విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతోనే విద్యను అభ్యసించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం,ఆదర్శ విద్యా నికేతన్ కంచిరాజు చెంగల్ రాజు,కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులు, ముత్యాల కిషోర్, రైల్వేకోడూరుకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## బాలికోన్నత పాఠశాలను పరిశీలించిన కమిషనర్

**బద్వేలు అర్బన్ , సెప్టెంబరు 30 ప్రభాతవార్త :**



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల, తాగునీరు వంటి వాటిపై దృష్టిసారించారు. అలాగే అక్కడి సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తప్పకుండా పాఠశాల పరిసరా ప్రాంతాలలో వంటశాల వద్ద పరిశుభ్రతను పాటించాలని లేని పక్షంలో విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాద్యాయులు, ఉపాద్యాయులు ఉన్నారు.

## వాహనదారులు పోలీసు నిబంధనలు పాటించాలి

**బద్వేలు అర్బన్ , సెప్టెంబరు 30 ప్రభాతవార్త :**



వాహనదారులు పోలీసు నిబంధనలు తప్పక పాటించాలని బద్వేలు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. సీఐ రాజగోపాల్ యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా పలు ప్రధాన రహదారులలో వాహనాల తనిఖీ చేపట్టి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులు మరియు ట్రిపుల్ రైడింగ్ లాంటి వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్ అంతరాయానికి గురికాకుండా వాహనదారులు సహకరించాలని వాహనదారులకు సూచించారు. ఈ తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ టూర్‌తో విద్యార్థులలో సాంకేతిక విజ్ఞానం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దశ్యం

**పీలేరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్తః**

నియోజకవర్గంలోని వాల్మీకిపురంలోని 9,10 తరగతుల విద్యార్థులు ఒకేషనల్ కోర్సులో భాగంగా ఐటీఐటీఎస్ ట్రేడ్‌కు సంబంధించి ఇండస్ట్రియల్ విజిట్‌కు గాను ఏపీ గ్రామసచివాలయంను సందర్శించారు. హ్యాండ్సమ్ లర్నింగ్ నేర్చుకోవడం ద్వారా పిల్లలలో నైపుణ్యాలను సాధించవచ్చు అని పాఠశాల హెచ్ఎం కల్పన సూచించారు. ఏపీ గ్రామ సచివాలయం విద్యార్థులు అక్కడ ఉన్న సిబ్బందితో ఇంటరాక్టు అయి కొత్త విషయాలను తెలుసుకున్నామన్నారు. ఇందులో భాగంగా పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, సచివాలయ సిబ్బంది ద్వారా చక్కని విసయాలను పంచుకున్నారు. ఈచక్కని అవకాశాన్ని కల్పించినందుకు మమ్మల్ని ప్రోత్సహించినందుకు ఏపీ సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ఒకేషనల్ ట్రైనర్ పి. సింధూజ పేర్కొన్నారు. ఒకేషనల్ ట్రైనర్ పి. సిందూజ పేర్కొన్నారు. పిల్లలతో పాటు గురుకుల సిబ్బంది కూడా ఈవిజిట్‌లో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**కలికిరి, సెప్టెంబరు 30 ప్రభాతవార్తః**



రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచి ఎ.రెడ్డిరామ్ పేర్కొన్నారు. సోమవారం రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో మంజూరుచేసిన ఉలవలను సర్పంచి రెడ్డిరామ్ రైతులకు పంపిణీ చేశారు. మర్రికుంటపల్లె పంచాయతీకి ప్రభుత్వం 30 క్వింటాళ్లు ఉలవలు సడ్సిడీతో మంజూరు చేయగా వాటిని రైతులకు సర్పంచి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి గాయిత్రి, హార్టికల్చర్ అసిస్టెంట్ రోషన్‌ఆరా, సచివాలయ సిబ్బంది,తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలికిరి మార్కెట్ యార్డు అక్రమాలపై విచారణ జరపాలి

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండు**

**కలికిరి, సెప్టెంబరు 30 ప్రభాతవార్తః**

కలికిరి మార్కెట్ యార్డులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, జిల్లా నాయకులు రంగారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కలికిరి మార్కెట్‌యార్డులో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కలికిరి మార్కెట్ యార్డులో పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ స్థాన చలనం లేకుండా అక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూములు కేటాయింపులో కానీ, పన్నులు వసూలులో కూడా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా వసూలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆఅధికారిపై గతంలో కూడా ఫిర్యాదు చేసినప్పటికి ఏడీఎం అధికారి విచారణ జరిపి చర్యలు తీసుకోకుండా మార్కెట్ యార్డులో పని చేసే అధికారికి ఒత్తాసుపలుకుతున్నట్లు వారు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో షాపులు కేటాయించడంలో కూడా భారీగా అవకతవకలు జరిగాయన్నారు. ఈవిషయంపై విచారణ జరిపి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లాలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది.

## ఉత్తమ ఉపాధ్యాయుడుగా డాక్టర్ ఓ హేమకేశవులు

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఓ.హేవకేశవులుకు ఐ.ఎస్.టి.ఈ(ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఆంధ్రప్రదేశ్ సెక్షన్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ నఅందు ఎంపికయ్యారు. ఈ సంధర్భంగా డాక్టర్ ఓ.హేమకేశవులు మాట్లాడుతూ తాను గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ సి.గంగిరెడ్డి, ప్రో ఛాన్స్‌లర్ సి.అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, హెచ్ఓడి డాక్టర్ ఎం.పద్మ లలిత, అధ్యాపక బృందం డాక్టర్ ఓ.హేవకేశవులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ ఓ.హేవకేశవులకు ఈ అవార్డు లభించడం ఎంతో ఆనందదాయకమన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణ మనం బాధ్యత

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్షను పల్లెపల్లెకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ పిలుపు మేరకు సోమవారం సాయంత్రం దొండపాడులో ఉన్న పురాతన శివాలయంలో జనసేన పార్టీ కోఆర్డినేటర్ దేరంగుల జగదీష్ సతీసమేతంగా దీపారాధణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్, సురేంద్ర, కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్య కుమార్‌ను ఘనంగా సన్మానం

**ఖాజీపేట, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



రాష్ట్ర కుటుంబ, సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం బీరం విద్యా సంస్థను సందర్శించారు. విధ్యార్థులు కనబరిచిన వేషధారణను ఆయన తిలకించి విధ్యార్థులను అభినందించారు. మంత్రికి విధ్యార్థులు పూలు చల్లుతూ ఆహ్వానం పలికారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి ఏర్పాటుచేసిన తేనేటి విందు స్వీకరించారు. ఈ సంధర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీరం విద్యాసంస్థల అధినేత, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన బీరం సుబ్బారెడ్డి అతి తక్కువ కాలంలోనే 3600మందిని బారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులుగా చేర్చడం అనేది హర్షించదగ్గ విశయం అన్నారు. కేవలం సిద్ధాంతాన్ని నమ్మడంతోనే బిజెపి తనను ఈ స్థాయికి ఎదిగేలా చేసిందన్నారు. అధిష్టాణం అప్పగించిన పనిని చిత్తశుద్ధితో నిబద్ధత చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల చైర్‌పర్సన్ సరస్వతి, డైరెక్టర్ స్వాతి, శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో స్వచ్ఛత పై ప్రతిజ్ఞ




**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

స్థానిక ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో సోమవారం నాడు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విధ్యార్థిని, విధ్యార్థులు గాంధీజి ఆశయ సాధనమైన స్వచ్ఛ భారత్‌పై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జి ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఘనంగా హెచ్‌ఎం పురుషోత్తం రెడ్డి పదవి విరమణ వేడుకలు



**చిట్వేలి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ప్లస్)లో ప్రధాన ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పొట్టిపాటి పురుషోత్తం రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఘణంగా జరిగింది. పురుషోత్తం రెడ్డిని ఆయన సతీమణి జ్యోతిని సహ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిగా పురుషోత్తం రెడ్డి వృత్తికి వన్నె తెచ్చారన్నారు. స్థానిక ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిట్వేలి ఉన్నత పాఠశాల పురోగతిలో తనదైన శైలిలో అందరితోనూ స్నేహపూరితంగా, మర్యాదగా వ్యవహరిస్తూ విధ్యార్థుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆయన కోనిఆడారు. లక్కిరెడ్డిపల్లె గ్రామస్థులైన రూపమ్మ, ఈశ్వర్ రెడ్డి సంతానమైన పురుషోత్తం రెడ్డి తన తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితబావంతో చిన్న తనం నుంచే జీర్ణిఇంచుకున్న తాను ఎక్కడ తన విధులునిర్వర్తించిన అందరిచే మన్ననలు అందుకున్నారని సాటి ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక ప్రభుత్వ కాలేజీ ప్రారంభంలోనూ, విద్యార్థులను సేకరించడంలోనూ సహ ఉద్యోగులతో కలిసి పురుషోత్తం రెడ్డి చేసిన కృషి అమోఘం అని స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కొనిఆడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోదండ నాయుడు, ఈశ్వరయ్య, ఉప హెచ్‌ఎం ఏబీఎన్ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు విశ్వనాథం, శ్రీనివాసులు, కామాటం వెంకటేశ్వర్లు, స్వతంత్ర బాబు, దుర్గరాజు, రాజశేఖర్, ఎస్ఎంసీ అధ్యక్షులు శంకర్ రాజు, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు ఇంతియాజ్, సాయిరాం, మునిరావు, తిరుమల రెడ్డయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రధాన ధ్యేయం : సబ్ కలెక్టర్

**రాజంపేట, సెప్టంబర్30, ప్రభాతవవార్త :**

ప్రజా సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ అధికారుల యొక్క ప్రధాన ధ్యేయమని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రావెన్‌సెల్ సమావేశానికి వచ్చిన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం మండల కేంద్రాలు మొదులుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వరకు గ్రీవెన్‌సెల్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రతి అధికారి ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పని చేయాలన్నారు. ఈ వారం వచ్చిన సమస్యలు వచ్చే వారం లోపు పరిష్కరించకపోతే ఆ శాఖల అధికారులపై ప్రభుత్వ పరంగా శాఖాపరమైన చర్యలు కూడా తప్పవన్నారు. గ్రీవెన్స్‌లలో వచ్చిన ప్రతి ఫర్యాదులను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.



## బిడ్డలకు ఆస్తి ఇచ్చేటపుడు పోషణ అనే షరతు అవసరం

**(దాన దస్తావేజులో అది లేనప్పుడు ఆస్తిని వాపసు అడిగే హక్కు తల్లిదండ్రులకు లేదన్న సుప్రీం కోర్టు)**

**(తల్లిదండ్రుల సంరక్షణ చట్టం సెక్షన్-23 పై స్పష్టత ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం**

**బద్వేలు లీగల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :**

సంతానానికి ఆస్తిని బదలాయించే దాన పత్రాలలో పోషణ అనే షరతు ఉంటేనే ఆ ఆస్తిని తిరిగి కోరే హక్కు తల్లిదండ్రులకు వర్తిస్తుందని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. జీవిత చరమాంకంలో తమ బాగోగులు చూస్తారనే నమ్మకంతో ఆస్తిని బిడ్డలకు కానుకగా వ్రాసి ఇచ్చే తల్లిదండ్రులు దాన పత్రములోనే ఆ షరతును సుస్పష్టంగా పేర్కొనాలని జస్టిస్ సంయ్.కె.కౌల్, జస్టిస్ ఎ.ఎస్.ఓకాలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం సుస్పష్టంగా ప్రకటించింది. అటువంటి షరతు లేని విషయంలో వృద్ధులైన తమను నిర్లక్ష్యం చేసిన కారణంగా తాము దారాదత్తం చేసిన ఆస్తిని బిడ్డల నుంచి తిరిగి వెనక్కి తీసుకునే హక్కు తల్లిదండ్రులకు ఉండబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. 2022 డిసెంబరు 7న ఒక కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ సలహా ఇచ్చింది. ఈ కేసులోని దాన దస్తావేజులో పోషణ అనే షరతు లేని కారణంగా ఆస్తిని తిరిగి వెనక్కి తీసుకునే హక్కు లేదని తేల్చి చెప్పింది. తల్లిదండ్రులు ఆస్తిని బదిలీ చేసేటపుడు తమకు మౌళిక సౌకర్యాలను, శారీరక అవసరాలను బహుమతి స్వీకర్త (సంతానము కానీ, ఆస్తి వారసులు కానీ) కల్పించేలా షరతులు విధించాలని, షరతుల ప్రకారం కనీస సౌకర్యాలను, శారీరక అవసరాలను తీర్చడానికి స్వీకర్త నిరాకరించడమైనా లేదా ఆ విధుల నిర్వహణలో విఫలమైనా ఒక లావాదేవీలో ఈ రెండు అంశాలు నెరవేరినపుడు మోసం, ఒత్తిడి లేదా అవాంఛనీయ ప్రభావం ద్వారా ఆస్తి బదిలీ జరిగినట్లు పరిగణించబడుతుంది. అప్పుడు అటువంటి ఆస్తి బదిలీ చట్టబద్ధంగా రద్దవుతుంది. బదిలీదారు అభ్యర్థన మేరకు ఆ ఆస్తి బదిలీని చట్ట విరుద్ధమైనదిగా (తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను స్వీకరించడానికి లేదా నెరవేర్చడానికి పిల్లలు తిరస్కరించిన సందర్భంగా) పరిగనించి ప్రకటించే అధికారాన్ని మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ కలిగి ఉంటుంది అని జస్టిస్ ఓకా తన తీర్పులో వివరిస్తూ పూర్తి స్పష్టతనిచ్చారు. తన సంరక్షణను చూడాలనే షరతును (చట్టంలోని 23వ సెక్షన్ (1) ప్రకారం) గిఫ్ట్ డీడ్‌లో విధించని కారణంగా పిల్లలకు బహుమతిగా ఇచ్చిన ఆస్తిని వెనక్కు ఇవ్వాలని కోరే హక్కు తల్లిదండ్రులకు ఉండదని జస్టిస్ కౌల్, జస్టిస్ ఓకా ల ధర్మాసనం పేర్కొంటూ దిగువ కోర్టు, ట్రిబ్యునల్ నిర్ణయాలను రద్దు చేసింది.

## బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవు

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**



బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రామలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరమని తెలిసినప్పటికి గ్రామీణ ప్రాంతంలో పేదరికంతో బాలికలను చదివించకుండా 14 సంవత్సరాలు నిండిన వెంటనే వివాహాలు చేస్తున్నారని, వాటిని అరికట్టాలన్నారు. బాలికల సంరక్షణకు 1098,112,100కు సమచారం అందించాలన్నారు. చిన్న వయసులోనే వివాహం చేసుకుంటే జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించాల్సి వస్తుందని ఆమె పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సమయపాలన పాటించాలి - ఎంఇఒ చక్రేనాయక్

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఓ చక్రేనాయక్

మండల పరిధిలోని దిన్నెపాడు పంచాయతీ దూదేకులపల్లె తెలుగు, ఉర్దూ మండల ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు చక్రేనాయక్ అకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల మేధస్సును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేటి విద్యార్థులే రాబోయే భవిష్యత్ తరాలకు, కాబట్టి పిల్లలు శ్రద్ధగా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విని చదువుల్లో రాణించాలని ఆయన పిల్లలను ఆకాంక్షించారు. అనంతరం పిల్లల హాజరు పట్టిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

### వందరోజుల కూటమి ప్రభుత్వంలో

## దళితులపై దాడులు సిగ్గుచేటు

**దళిత అధికారిపై దాడికి పాల్పడ్డ ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేయాలి**

**బిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్**




సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న బీఎస్పీ నాయకులు

**మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**

వందరోజుల కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు చేయటం సిగ్గుచేటని బిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ విమర్శించారు. సోమవారం దళితులపై దాడులకు పాల్పడిన ఎమ్మెల్యేలు రఘు రామకృష్ణంరాజు, పంతం నానాజీలపై కేసునులో నమోదు చేయాలంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో వున్న అంబేద్కర్‌కు సంబంధించిన బోర్డును ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తొలగించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తొలగించిన బోర్డును వెంటనే ఏర్పాటు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఓ కళాశాలకు చెందిన దళిత అధికారిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజి దాడి చేయటం సిగ్గుచేటన్నారు. అధికారం ఇచ్చింది, ప్రజాసేవకు అన్ని మరిచి అధికారులపై దాడులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. నిరసన చేపట్టిన గౌతమ్‌కుమార్, బీఎస్పీ నాయకులను పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపేశారు.

### వార్తకు స్పందన

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

**బద్వేలు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :**

పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులో ఉన్న రూ.10కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ జేసీబీ తో గుంతలు తీసి గుర్తించారు. కొద్ది రోజుల క్రితం రూ.10కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణకరువు అనే శీర్షిక వార్తలో వెలువడిన నేపథ్యంలో సోమవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. బైపాస్‌రోడ్డులో ఉన్న బద్వేలు పంచాయతీ సర్వేనెంబరు 1156 లో 70 సెంట్లు , చెరువు పోరంబోకు స్థలానికి రక్షణ లేకపోవడంతో ఆక్రమించేందుకు కొంతమంది సిద్దపడ్డారు. ఈ నేపథ్యంలో వార్త పత్రికలో ప్రచురితమైన శీర్షిక ఆధారంగా స్థలాన్ని గుర్తించి జేసీబీ సహాయంతో హద్దులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించి 70 సెంట్ల స్థలానికి రక్షణ కల్పించారు. ప్రభుత్వ స్థలంలో ఎవరు ఆక్రమణలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు హెచ్చరించారు. విలువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని రక్షిస్తామని పేర్కొన్నారు.

